


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
బహుమతి పొందిన ఉత్తమ నవల

**(గత సంచిక తరువాయి)**

## ౬. వేట

**కొత్త జీవితాన్ని ఆరంభించే ముందు** మురికి కూపంలాంటి ఈ గది మారాలి. ఎర్రని ఏగానీ లేదు అతని దగ్గిర. తనను కుదువ పెట్టుకోడానికి కొంతకాలం పడుతుంది. వేదాంతరావు సంతోషంగా కుదువ పెట్టుకుంటాడు ఎగిరిగంతేసి. మరోలా బ్రతకడం సాధ్యం కానపుడు అది తప్పదు. అమ్మేయగల వస్తువులు ఏమున్నాయి? ఒక నెల రోజుల జరుగుబాటుకు అవసరమైన మోయిన కావాలి ప్రస్తుతానికి. తన మనసులో భావోద్వేగాలకు తావు లేకుండా పోయింది. అవి ప్రతిబంధకాలు. ఉన్న తన గురించీ మాత్రమే ఏడవాలి; పోయిన వాళ్ళ గురించీ కాదు. గది మూల తక్కువ ఎత్తు బల్లలా ఉపయోగపడుతున్న ట్రంకుపెట్టె కనిపించింది. దానివైపు మనసు పోకుండా జాగ్రత్త పడ్డాడు ఇన్నేళ్లు. అది ఇపుడు ఖజానాలా తోచింది. ఆ ఇనుప పెట్టెతో గల ఆత్మీయ బంధం ముక్కలై మిగిలింది. తన త్రోవలో మానసిక కంటకాలు తొలిగిపోవాలి. అది జరిగింది. ఆటంక పరిచే జ్ఞాపకాలకు తిలోదకాలు ఇచ్చింది మనసు.

ట్రంకుపెట్టె తెరిచాడు. ఎంతో దళసరిగా ఉంది. తెరిచేటప్పుడూ, మూసేటప్పుడూ, వయసు ముదరడంవలన వచ్చే కీళ్ల నెప్పులతో శబ్దాలు చేస్తోంది ఈ కాపలాదారు. వస్తువును వెండి భరిణలోపలనుంచి తీశాడు, వెండి భరిణనూ అమ్ముకోవచ్చు. దాని వలన వడ్డీలా మరికొంత డబ్బు వస్తుంది.

కురుపాం మార్కెట్టు దగ్గిరకు వెళ్లి ఎడమవైపు సందులోకి నడిచాడు. చివరి దాకా వెళితే సముద్రపు ఒడ్డు వస్తుంది. అవసరపడితే ఉపయోగించుకోవచ్చు. సగం దూరంలో కనకాచారి కొట్టుంది. అనంతం ఆ కొట్టుకు ఎప్పుడూ వెళ్ళ లేదు; అవసరం లేదు కాబట్టి. ఆచారి పేరు అపూర్వమైనదిగా, ఆత్మీయమైనదిగా అతని తల్లి ఉచ్చరించడం రెండు మూడు సార్లు

విన్నాడు అనంతం. ఆమె తండ్రి ఈ వస్తువును అతగాడి చేత చేయించాడట. అదేమీ కళాఖండం కాదు. ప్రతి స్త్రీ పెళ్ళిలో మెడకు వేళ్ళాడేట్టు వేయించుకుని వైధవ్యంలో తీసేసేది. కళాత్మకంగా ఇతర నగల్లా తయారు చేయవలసినది కాదు.

"వాడు బతికి ఉన్నాడో, ఏనాడో పోయాడో! వాడి దగ్గిరకి పోతే తాను చేసిన వస్తువు కాబట్టి పది రూపాయలు అధికంగా ఇస్తాడేమో నని ఆశ; కనీసం ఒంకలుపెట్టి మరీ తక్కువ విలువ కట్టకపోతే చాలు."

ఈ లోకంనుంచి పోవడానికి మాత్రం సిద్ధంగా ఉన్నాడు; కేవలం తనలాంటివాళ్లకై శబరిలా ఎదురు చూస్తూ. దుకాణం వీధి వరండాలో కూర్చుని ఎదో వస్తువును ఒక రాతి మీద గీసి, దాని నాణ్యతను కళ్ళ దగ్గిరగా ముందే గీసిన అసలు గీతనుంచుకుని దళసరి కళ్ళ జోడు గుండా పరిశీలిస్తున్నాడు.

'కనకాచారి గారు ఉన్నారా అండీ?"

"నేనే!"

అతను తలెత్తి సూక్ష్మదర్శిని లాంటి అతని కళ్ళ జోడు ద్వారా అనంతం నాణ్యతను పరిశీలించి, నూతి అడుగున కూర్చుని అన్నట్టు అన్నాడు.

"ఒక వస్తువును అమ్మడానికి తెచ్చాను కొంటారా?"

తల అతి స్వల్పంగా కదిపాడు ఎక్కువాగా కదిపితే ఏమి నష్టం వస్తుందో అన్నట్టు. కదలిక అర్థం కొంటాననో కొనను అనో. అతని క్షీణించిన దక్షిణ హస్తాన్ని ఆస్థిపంజరం జాపినట్టు జాపడం వలన అది అతని అంగీకారంగా భావించి ఆ వ్యక్తి తనకు మేలు చేయబోతున్నవాడిలా భావించి తెచ్చుకున్న వినయంతో వస్తువును ఆ చేతిలో ఉంచి చేతులు వేలాడేయడం ఇష్టంలేక కట్టుకుని నిలబడ్డాడు. 'కూర్చో' అన్నట్టు క్షీణించిన వామహస్తంతో వరండాలో మరో చివర ఉన్న అల్లిన ఇనుప కుర్చీని చూపాడు. అల్లికను మినహాయిస్తే దానికి కనకాచారి వయసు ఉండొచ్చు. గీత గీసి మిగతా గీతలతో పోల్చి కళ్ళజోడు నుంచీ, దాని పైనుంచీ కూడా మార్చి మార్చి చూస్తూ పెదవిని పదే పదే విరిచాడు అది పాడైపోతుందని కూడా ఆలోచించకుండా. పెదవులేకాక, వాటి విరుపు (వాటి మరో చర్యను కాస్త పక్కనుంచి) అద్భుతమైన చర్య; నిత్య నూతనం. అందమైన స్త్రీ పెదవులకున్న విలువ మిగతా వాళ్ళ పెదవులకు లేకపోవచ్చు. వాటిని అనేక విధాలా విన్యాసాలు చేయించడం, ముద్దు అనే పనికి వాడుకోడం మనిషికి తెలిసినట్టు మరో జీవికి తెలియదు. దేవుడు పక్షపాతి.

"ఎక్కడ చేయించారో?"

"మీ దగ్గిరే; చాలా సంవత్సరాల క్రితం."

"నేను ఇంత నాసిరకంగా చెయ్యనే?"

"మా అమ్మగారు ఎప్పుడూ మీ పేరే తలచుకుకుండే వారు. ఎంతో నాణ్యతను, నిపుణతనూ చూపిస్తూ మీరు ఆ తాళి బొట్టును చేశారని," నిరుత్సాహంగా అన్నాడు అనంతం.

“నా కొట్లో ఎవడో పనికి మాలిన పనివాడు చేశాడేమో మీరన్నది నిజమే ఐతే; అలా అని నాకు బాధ్యత లేదని కాదు.'”

“మా అమ్మకు పొరబాటున కూడా అబద్ధం ఆడటం ఎంచేతో రాదు,” అన్నాడు అనంతం.

“'మీదీ మీ అమ్మగారి గుణమేనా?”

'మీ ఉద్దేశం అర్థమయ్యింది. నా నగ నాకు ఇచ్చేయండి.”

“సరే సరే” అని దాని వెలెంతో చెప్పాడు తూకం వేసి.

“మరో చోట చూపించుకుంటా, ఇచ్చేయండి.”

“'మీకు నా తూకం మీద అపనమ్మకం ఉంటే పక్క సందులోని ధర్మ కాటాకు వెళ్లి తూకం వేయించుకు రండి నేను పంపానని చెప్పి.”

“'మీరు ఎంతవరకూ ఎవ్వగలరో చెప్పేయండి; నాకు ఇష్టం ఐతే అమ్ముతాను లేకపోతే మానుతాను.”

రెండు నిముషాలు జపం చేస్తున్న ముసలి నక్క తీరుతో మౌనం పాటించాడు.

“'ఇంతక ముందు ఏదన్నా నగ అమ్మారా?”

“రెండుసార్లు," అంటూ అబద్ధాన్ని అవలీలగా ఆడాడు.

తాను ఎంతవరకు ఇవ్వగలడో చెప్పాడు కనకం. అనంతం మరో యాభై అన్న ఇవ్వమన్నాడు. అతను పాతిక ఇచ్చాడు.

గది మారిన మూడో రోజు పొద్దున్నే ఇంటి గుమ్మం ముందు నిలబడి రోడ్డు మీదికి చూస్తున్నాడు. కొత్త జీవితం. అద్దె ఎక్కువ. బయానా రెండు నెలలకు తీసేసుకున్నారు. మిగిలిన డబ్బుతో ఉద్యోగమో సద్యోగమో దొరికేంతవరకు జీవితాన్ని నెట్టుకు రావాలి. కూలిపని చేస్తే ఎలా ఉంటుంది భేషజానికి పోకుండా? అది అలవాటు లేని పని. ఏ పనికైనా మొదలు పెట్టడం అనేది ఉంటుంది. నిజమేగాని కాయకష్టానికి అనుగుణంగా తయారయిన శరీరం కాదిది అనుకున్నాడు అనంతం. తాను ఏ ప్రయత్నం చేయాలో అతనికి తెలియక పోవడం వలన ఏ పనికీ పూనుకో లేదు. అవకాశాన్ని తాను ఎలా వెదుక్కుంటూ వెళ్ళాలో తెలియడం లేదు. ఆ అవకాశం దానంతట అదే రావాలి, ఒక మార్గం గోచరం కావాలి దానంతట అదే. అపుడు తాను చేయవలసిందల్లా చేస్తాడు.

ఎడమవైపు నుంచి కుడి వైపుకు వెళుతున్న ఒక జంటలోని వెనుక కూర్చుని ముందునున్న పురుషుడి భుజం పక్కనుంచి ముందుకు చూస్తున్న ఒక స్త్రీ అతని దృష్టిని ఆకట్టుకుంది. ముందున్న వాడు మొగుడో సోదరుడో తెలియదు. ఈజిప్ట్ రాణిలా వింతగా, ఆకర్షణీయంగా ఉందామె. ఆమె బానిస ఆమెను చూసి గర్వపడేలా ఉంది. కియోపాత్రా మాత్రం కాదు. కాపురుషుడిని కవ్వించేట్టు పోతపోసిన శరీరం. ఆమె ఏదో పెళ్ళికి వెళుతున్నట్టు, రాళ్ళ నగలు లోతుగా దిగేసుకొని ఉంది. ఒక జీవితం ఖరీదు చేస్తాయేమో అవి. కుడి వైపుకు ఆ వాహనం వెళ్ళిపోయింది. కనబడేంత వరకూ చూశాడు రెప్ప

వేయకుండా. కళ్ళు మిరుమిట్లు గొలిపిన దృశ్యం; మెరుపులా అంతమయ్యింది. అతని అణువణువూ తనదైన అవకాశం, పెన్నిధి దూరమైనట్లు మూలిగింది, దిగులుపడింది. గుమ్మంముందు కూలపడ్డాడు నిస్సత్తువగా. ఎవరో స్త్రీ తనకు ఇంతకు ముందు ఏ విధంగానూ తెలియకపోయినా ఇంతటి సంచలనాన్ని, ఆవేదననూ, ఆశాభంగాన్ని ఎందుకు కలిగించింది? స్త్రీ పురుషుల ప్రేమ భావం కాదది. ఒక లాటరీని ఒకే సంఖ్య తేడాతో కోల్పోయిన నిరాశ. ఆమె తనకు ఇక కనిపించదని – కేవలం కనిపించడమే కావాలి అని అతనికి అనిపిస్తే – ఎందుకనుకోవాలి? వెంటనే అతనిలో క్షణికపు నిరాశా ఆశగా రూపు దిద్దుకుంది. ఆమె కనిపించడం అంటూ జరిగితే తనకే తెలియని జరగవలసింది జరగక పోదు. గోరు దొరికితే వేలు, వేలు దొరికితే యావత్తు శరీరం, ఆ పై ఆమె యావత్తు శరీరం ప్రసాదించబోయే పెన్నిధి దొరుకుతాయి. నిజమైన ఈ కొత్తజన్మకు తగిన  కొత్త జీవితం ఆరంభమవుతుంది. అవి ఉన్మాద  ఆలోచనలుగా తోచాయి. ఆశ ఒప్పుకోలేదు అవి ఉన్మాద భరీతమైన వనని. నిలబడి, గదిలోకి వచ్చి మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు సుస్వప్న సమానమైన గడిచిన క్షణాలను జ్ఞప్తికి తెచ్చుకోడానికి. సుస్పష్టంగా అంతా చూపింది మనసు తన యవనికపై. ఆమె అనంతాన్ని కొంచంగా చూపు తప్పి చూసిన భావన అతనికి కలిగింది.ఎవరైనా తనను అరక్షణం చూస్తే పూర్తి క్షణంపాటు చూడాలనుకుంటారని అతని విశ్వాసం. ఆమెకు పూర్తి క్షణం చూసే అవకాశం దొరకలేదు.

మరుసటి రోజు ఆమె నిన్న అటుగా వెళ్లిన సమయానికి పావుగంట ముందు గుమ్మముందు అరగంటపాటు నిలబడ్డా ఆమె రాలేదు. వెంటనే అతనికి ఒక విషయం గమనికకు ఒచ్చింది. వాహనాల రాకపోకలు ఆ వీధిలో తన ఇంటి ముందు జరగడం లేదని. ఈ సందు కుడి వైపు ప్రధాన రహదారిలో అంతమవుతుంది. సాయంత్రం పూట కూడా రాకపోకలు గమనించి కారణం తెలుసుకుందామని వెళ్ళాడు. ఆ చివర పెద్ద గొయ్యి తవ్వి ఉంది. దేని గురించో? ఎన్ని రోజులు పడుతుందో అది పూడవడానికి? గొయ్యి మీది నుంచి అవతలికి దూకి కొంచం దూరం నడిచి, పక్క సందులోకి వెళ్లి, ముందుకు నడిచి, తన ఎడమ వైపు చివరకు చేరి, అక్కడి నుంచి ప్రతి ఇంట్లోకి ఆగి ఆగి మరీ చూస్తూ నడిచాడు ఆమె కనిపిస్తుందేమో నని. శ్రమ వృథా అయింది. ఆ వీధి చాలా పొడవైనది. గొయ్యి పూడ్చే దాకా వేచి ఉండాలి; ఒక సదావకాశానికి ఎదురు చూస్తున్నట్టు. రెండు రోజులాగి పరిసర ప్రాంతాన్ని చూద్దామని వెళ్ళాడు. రెండు సందుల తరువాత ఒక ప్రయివేట్ క్లబ్బు ఉంది. దాని ముందు విశాలమైన ఖాళీ స్థలం ఉందిదురాక్రమణచెయ్యి అంటున్నట్టు.  అందులో కొందరు వాలీబాలు ఆడుతున్నారు. వెళ్లి నిలబడి చూడడం ఆరంభించాడు. రెండు నిముషాల తరువాత – ఆ జట్టులలో సభ్యుడేమో – ఒక వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. "మీరు ఆడగలరా?" అనంతాన్ని అడిగాడు. చాలా రోజులయింది బడి జట్టులో ఆడి. అప్పుడు అతన్ని మంచి ఆటగాడిగా పరిగణించే వాళ్ళు. నెట్ ముందు ఎగిరి బంతిని కొడితే అవతలివాడు దాన్ని ఎత్తే ప్రసక్తిలేదు. చొక్కా విప్పి బనీను, పాంటుతో, చెప్పులూ వొదిలేసి వాళ్ళతో ఆడాడు. జట్టు రెండు సార్లు గెలిచింది. కాళ్ళు పుండ్లయ్యాయి. ప్రతి దెబ్బనూ మెచ్చుకున్నారు అందరు. చీకటి పడిపోయింది, ఆట ముగిసి ఎవరి మానాన వాళ్ళు వెళ్లి

పోతూ అనంతం గురించీ అడిగి తెలుసుకున్నారు. అందులో ఎర్ర పొట్టి లాగూ, బనీన్ తో ఆడిన మనిషి ఎక్కువగా పొగిడాడు. అతను  తన మోటార్ సైకిల్ దగ్గిర నిలబడ్డాడు. పొంటూ, పొడవు చేతుల చొక్కాలోకి మారి ఉన్నాడు.

"మీరెక్కడుంటున్నారూ?" అన్నాడు.

అతన్ని తదేకంగా చూడడం మొదలుపెట్టాడు అనంతం, సమాధానం చెప్పకుండా.

"ఏం అలా  చూస్తున్నారు? మనకు గత  పరిచయం ఉందా ఏవిటి?' అడిగాడతడు.

"లేదు. కానీ మిమ్మల్ని ఎక్కడో చూసినట్టనిపిస్తోంది. నేను ఒక్కసారి ఎవరినైనా అతి తక్కువ సేపు చూసినా గుర్తుంచుకుంటాను. మిమ్మల్ని ఒక్కసారే కొన్ని క్షణాలపాటు చూసి ఉండాలి. మిమ్మల్ని చూసిన భావన కలుగుతోంది కానీ ఎప్పుడూ, ఎలా అన్నది మనసు గుర్తుకు తేవడం లేదు," అన్నాడు అనంతం.

అతను ఆడుతున్నంత సేపూ మెచ్చుకుంటూ వచ్చినా ఈ క్షణాన మాత్రం అనంతం మాటలకు అతని మీద ఒక వెర్రి నవ్వు ప్రసరించాడు. తనను వెర్రి వాడిగా అంత త్వరగా అంచనా వేసిన ఆ ఆగంతకుడివైపు జాలిగా చూశాడు అనంతం.

"నా మాటలు నవ్వు పుట్టించ వచ్చని అవి అంటున్నపుడే గ్రహించాను," అన్నాడు అనంతం.

అతను కంగు తిన్నాడు.

"అబ్బే అదేమీ లేదు, గురూ గారు. నాకు తెలియ కుండా ఒచ్చిందది. ప్రతి నవ్వులోని అంతరార్థాన్ని అతిగా వెదకకూడదు. నిజం చెప్పాలంటే మీరు మాట్టాడిన విధానం నాకు నచ్చింది కూడా. నన్ను మీరు చూసి ఉండొచ్చు అన్నారు; మీరు నన్ను చూసి ఉంటె నేనూ మిమ్మల్ని చూసి ఉండటానికి అవకాశం ఉంది కదా. అలాంటప్పుడు మీలో కలిగిన భావన లాంటిది నాకెందుకు కలగలేదా అనిపించింది."

'మీకూ నాలాగే జ్ఞాపకశక్తి అధిక స్థాయిలో ఉందా, గురూ గారు?"

"మీ దానికంటే ఎక్కువా, తక్కువా అని పోల్చి చెప్పలేను కానీ, అందరూ అంటుంటారు ఏనుగులా నేనూ దేన్నీ మరిచిపోనని. ఇలా జరిగుండొచ్చు:  మీరు నన్ను చూసి ఉండొచ్చుగాని, నేను ఏ కారణం వలనో మిమ్మల్ని చూసి ఉండక పోవడానికి అవకాశం ఉంది, కాదనను."

అప్పుడు ఒక బలహీనమైన కారణం అనంతానికి తట్టింది. ఆ రోజున నేను చూసిన వ్యక్తి వీడే ఎందుకు కాకూడదు? ఆరోజున వీడు నన్ను చూడలేదు.

"సరే లెండి ఈ లోకంలోని జ్ఞాపక శక్తిని నేను గుత్తకు తీసుకోలేదు కదా!"

"మీరెక్కడుంటారో?"

అనంతం ఇంటి సంఖ్యతో సహా చెప్పాడు.

"నా కార్యాలయానికి మీ ఇంటి ముందు నుంచే వెళుతుంటాను. నాల్రోజునుంచి దిక్కు మార్చాను మీ ఇంటి వీధి చివర గొయ్యి తవ్వడం వలన."

"దాన్ని నిన్ననే మూసేశారు."

"రేపటి నుంచీ మీ వీధి నుంచే వెళ్ళచ్చన్న మాట."

ఆ తరువాత బైకు స్టాండు తీసి, కిక్కు కొట్టి, "ఆ దగ్గరలో వదిలేస్తా రండి, మీరు బండి మీద వచ్చినట్టు లేరు," అన్నాడు.

'నాకు బండుంటే కాదయ్యా రావడానికి?' మనసు సమాధానం చెప్పింది.

ఎక్కి కూర్చున్నాడు అనంతం. అతను ఇంకేమీ మాట్లడలేదు. అతని ఇల్లు వచ్చిన తరువాత బండి ఆపి, "మీరెళ్ళగలరా నేను మీ ఇంటిదాకా రానా?" అన్నాడు.

అలా అడగటం కన్నా – 'ఇంట్లోకి వస్తారా?' అని అంటాడేమో అని ఆశించాడు అనంతం.

“అబ్బె ఎందుకులెండి నాలుగు అడుగులు వేస్తె నా గది," అన్నాడు అతని ఇంట్లోకి చూపు సారించి.

కదులుతున్న తెర, గోడకున్న పటం కనిపించాయిగాని మనిషి ఎవరూ కన్పించలేదు.

"రేపు వస్తారా ఆటకు?" అతను అడిగాడు వెళ్లిపోతున్న అనంతంతో.

"ఎందుకు రానూ?" అని అన్నాడు కుంటుకుంటూ నడుస్తూ.

అతను తానే గేటు తీసుకుని, బండిని తొడలతో తోసుకుంటూ లోపలకు జొరబడి కనబడటం మానేశాడు. తల తిప్పుకుని అనంతం తన గదికేసి నడుస్తున్నాడు. పాత కెట్స్ ఉన్నాయి, అవి వేసుకోవాలి. లేక పొతే మరీ బికారి వాడిలా కనిపిస్తాను అనుకున్నాడు. ఆట మీద నిజానికి మోజు లేదు. ఏది ఎందుకు జరుగుతుందో మరి. మైదానం వైపు వెళ్లడం, ఆడటం కాకతాళీయంగా జరిగాయి తనకు మేలు చేసే ఉద్దేశంతో అన్నట్టు. ఆనందంగా ఉంది. ఆమె ఒక క్షణం కంట పడితే ఈ ఆనందం అధికంగా ఉండేది.

మరుసటిరోజు తొమ్మిదిగంటలప్పుడు ఆ జంటకై ఎదురుచూశాడు. ఆశాభంగమైంది. సాయంత్రం నాలుగు గంటలప్పుడు ఆడటానికి వెళ్ళాడు పాత కెట్స్ కట్టుకుని. ఆటకు అతను రాలేదు. ఒకరి పేరు ఒకరికి చెప్పుకోలేదన్న విషయం గుర్తుకొచ్చింది. పరిచయం పెంచుకోవాలన్న విషయం అనంతం గమనికకు రాలేదు. అల్లా జరగాలని ఇప్పుడు ఎదురు చూస్తున్నాడు. అవతలి వ్యక్తికీ ఆ ఆసక్తి ఎందుకుండాలి? అతను ఆరు గంటలయినా రాలేదు. అప్పుడు పక్క ఆటగాడిని అడిగాడు అతని గుర్తులు చెప్పి.

"కృపారావు అమావాస్యకూ పున్నమికీ వస్తాడంతే. కాంపు మీద ఏ ఊరో వెళ్ళుంటాడు. ఖాళీ దొరకదు అతనికి," అన్నాడు.

సర్వ్ చేయమని బంతిని అనంతానికి ఇచ్చాడు; సరిగ్గా కొట్టలేకపోయాడు. ఉన్నట్లుండి ఆట మీద ఆసక్తి ధ్వంసం అయిపోయినట్టు. ఆ ఆట అయిపోగానే వెళ్లిపోదామనుకున్నాడు. ఎలాగూ మరో అరగంటకు చీకటి కమ్ముతుంది.

అతనొచ్చాడు. అనంతం బంతిని స్మాష్ చేసి అతని నుంచీ శహబాష్ పొందాడు.

"మీ గురించీ ఎదురుచూస్తున్నా!" అని అనంతం అనకుండా ఉండలేకపోయాడు.

“ధన్యవాదాలు," అన్నాడతను అనంతం మాటలను తేలిగ్గా తీసుకుంటూ.

రెట్టించిన ఉత్సాహంతో మొదటి రోజుకన్నా బాగా ఆడాడు అనంతం.

"వటుడింతై అన్నట్టు రోజు రోజుకూ మీ విశ్వరూపాన్ని పెంచుతున్నట్టుంది," అని కృపారావు మెచ్చుకున్నాడు స్నేహ స్వరంతో.

ఆట ముగిసి వెళుతున్నప్పుడు బండి మీద తీసుకెళ్లి తన ఇంటిముందు ఆపాడు.

“లోపలికి రాండి; మీతో కలిసి టీ తాగుతానన్నమాట," అన్నాడు  ఆదర్శ గృహస్థులా.

"అంతకన్నానా?"

ఆ అవకాశం గురించి గోతి కాడ నక్కలా ఎదురుచూస్తున్న అనంతం, ఆ మాటలు అన్నదే తడవు అతనితోబాటు లోపలకు చొరబడ్డాడు.

"మీ ఇంటి ఆవరణంతా సుగంధంతో నిండి ఉంది," అన్నాడుఆదర్శ గృహస్థులా .

అది నిజమే. ఆ మాట అనడంలో అనంతం ఉద్దేశం వేరు. 'రమ్మని అనడమే తడవు లోపలి చొచ్చుకొచ్చాడు' అని కృపారావు ఒకవేళ అనుకుని ఉంటే ఆ మెచ్చుకోలు  దాన్ని చెరిపెయ్యవచ్చు.

"రజనీగంధా ఉందికదా ఇంటి ముందు," అనంతం చూసి ఉండడన్న భావంతో అన్నాడు కృపారావు.

"నేను గమనించలేదు."

విశాలంగా ఉంది డ్రాయింగ్ రూమ్. మెరుస్తున్న తోలు సోఫాలు గోడలకు వేసి ఉన్నాయి. మధ్యలో విశాలమైన టీపోయ ఖాళీగా ఉంది. పెద్ద పెద్ద కిటికీలు; వాటికి జలతారు తెరలు వేలాడుతున్నాయి. 'నా గదికి మూడింతలుంటుంది ఇది' అనుకున్నాడు అనంతం. ఉత్తర ముఖ ద్వారం నుంచీ ఇంటిలోకి వచ్చి ఉన్నారు. దక్షిణపు గోడకు ఒక తైలవర్ణ చిత్రం వేలాడుతోంది స్త్రీ, పురుషలది. ప్రేమ మైకంలో వాళ్ళ ఇరువురి కళ్ళు తేలిపోతున్నట్టున్నాయి. రంభా నలకూబరులేమో. కృపారావు కూర్చోమన్నాడు.

"చిత్రం బాగుంది," అన్నాడు కూర్చుంటూ, చిత్రకళలో అభినివేశం ఉన్నట్టు.

"ఆహా," అన్నాడు కృపా.

వెలుపలి గదిని లోపలి గదితో వేరు చేస్తున్న గుమ్మపు తెరను తొలగించుకుని ఆమె వచ్చింది. రంగస్థలం మీది తన పాత్రను పోషించడానికన్నట్లు. ఆమె రావడం తల దించుకుని ఉన్న అనంతం గమనించాడు. మర్యాదగా ఉండదేమో నాని

తల ఎత్తలేదు. ఆమె పాదాలు మాత్రం చూశాడు. వెండి మెట్టెలకు మువ్వలున్నాయి. పాదం వేళ్ళు వయ్యారాలు పోతున్నాయి.

"నా శ్రీమతి, సుమతి."

అనంతం తలెత్తి నమస్కరించాడు. ఆమె ప్రతినమస్కారాన్ని సూచిస్తూ ఒక చెయ్యిని ఆడించింది తల కొంచంగా ఒక వైపు వాల్చి.

"వీరు మొన్ననే పరిచయమయ్యారు. మాంచి వాలీబాల్ ఆటగాడు. మన ప్రాంతంలోనే ఉంటున్నారు," అని అంటున్నప్పుడు అనంతం పేరు కనుక్కోలేదన్నవిషయం కృపారావుకు గుర్తుకొచ్చింది.

"నా పేరు అనంతం అండీ," ఆమెను ఉద్దేశించి అన్నాడు.

ఆమె రాత్రివేళ గౌనులో ఉంది. నిలువెత్తు మనిషి. ఆ దుస్తులలో ఆమె అసలు శరీరాకృతి తెలియడం లేదు. తెల్లటి గౌనును రాతి విగ్రహానికి తొడిగినట్టు నిలబడి ఉంది. ఆమె ఆకర్షణీయంగా ఉంది. కానీ అతని దృష్టి సుదూర తీరంవైపు సారించి ఉంది. పక్కనే ఉన్న కృపారావు ఉనికి కారణంగా చూపును మరలించాడు. ఆమె నవ్వు ఆశ లాంటి నవ్వు. అలంకరణలో ఏదో ప్రత్యేకత ఉన్నట్టు అనంతానికి అనిపించింది. ఆమె మెడ బోసిగా ఉంది. అనవసరం అన్నట్టు నుదుట ఒక ఎర్రటి చుక్క. చెవులకూ, ముక్కుకు ఒకే రకంవి రాళ్లు; బండరాళ్లు కాదు. ఆమె అభివాదం చేస్తున్నపుడు వీ నెక్కులోనుంచి లోయ తొంగి చూసింది. సగం జుట్టు కుడి భుజం వెనక్కు తోసుకుంది. రాళ్లనగలు బీరువాచేరుంటాయి.

"కాఫీ లేక టీ?" అడిగాడు కృపారావు.

రాముడు మంచి బాలుడు అన్న వైఖరితో తల ఒంచుకుని పెళ్లి చూపులలోలా కూర్చుని ఉన్నాడు అనంతం.

'ఏమీ ఒద్దు, అలవాటు లేదు," అన్నాడు తడి ఆరిన గొంతు సవరించుకుని.

"మంచి నీరు తాగటం అలవాటుందా?" అనిందామె తీగలు ధ్వనించినట్టు.

“అలవాటు లేకపోయినా తాగడానికి అభ్యంతరం లేదు; కాక పోతే మరీ శీతలంగా ఉండకూడదు," అన్నాడు ఆమెకు తీసిపో దలచుకోక.

“శీతలపానీయం ఏదైనా తాగ వచ్చుకదా?" కృపారావు అడిగాడు.

"వాటినీ పెద్దగా ఇష్టపడను," అన్నాడు అనంతం.

"మీకు ఇష్టం లేకపోయినా అది చిన్న విషయం కాబట్టి ఈ ఒక్క పని చేయొచ్చుగా మమ్మల్ని ఆనందింపచేయడానికి?" కృపా అన్నాడు.

"నాకు ఇష్టంలేని పనిని నా చేత చేయించడం మీకు ఏవిధంగా ఆనందాన్నిస్తుంది?"

ఆమె లోపలి వెళ్ళిపోయింది. ఇక రాదా తిరిగి? కష్టపెట్టాడా? మూర్ఖత్వాన్ని ప్రదర్శించాడా పరిచయంలేని వ్యక్తుల ముందు? మొదటి పరిచయాన్ని చెడగొట్టాడా? విషం కాదుగదా వాళ్లు తాగమంది? మత్తుపదార్ధమూ కాదు. అసలు

విషయాలన్నీ అతి వేగంగా దొర్లిపోతున్నట్టుంది. కాస్త ఆలోచించి సరైన విధంగా స్పందించే అవకాశం కలుగుతున్నట్టు లేదు వేగం కారణంగా.

"వస్తా కృపా రావు గారు. మీ శ్రీమతి గారికీ చెప్పండి."

"లేదు; క్షణం కూర్చోండి; ఆ తరువాత వెళ్లిపోవచ్చు."

ఆమె తిరిగి వచ్చింది. ముఖంలో నవ్వు వున్నది. కనుగుడ్ల తెల్లుపుదనం వెండి చేపలను తలపింప చేస్తోంది. ఆమె చేతిలో పొడవైన గ్లాసుంది. అది ఉమ్మెత్త పూవు ఆకృతిలో, సన్నటి నడుముతో ఉంది. చేతిలో పూర్తిగా బిగించి దానిలోని దాన్ని అనుభవించడానికి వీలుగా. నురగతో ఉపరితలం కప్పబడి ఉంది.

"ఇది సోడా మాత్రమే; చల్లనిదీ కాదు," అనింది

రెండే క్షణాల్లో తాగేశాడు; ఘాటుగా ఉంది. గ్లాసును జాగర్తగా టీపాయి మీద ఉంచాడు. ఆమె లోపలి వెళ్ళబొయింది; అనంతం లేచి, ఆమెనూ ఉద్దేశించి "వస్తానండీ," అన్నాడు.

ఆమె గుమ్మం ముందే నిలబడి 'మంచిదండీ," అన్నతరువాత కృపారావు వీధిలోకి ఒచ్చాడు. వీధిలోని లైటును ఆర్పేసిందామె. కృపారావు నీడ అనంతం మీద పడుతోంది. రజనీగంధ వైపు ఈసారి చూశాడు అనంతం. ఈ క్షణాన్ని కాస్తన్నా మాటలు సాగ కొట్టాలనిపించింది అతనికి, లైటు తీసినా ఆమె గుమ్మం ముందు నిలబడి ఉండటం చేత.

"నేను అయిదేళ్ల వయసులో కావలిలో కొంతకాలం ఉండాలిసి వచ్చింది. మా చిన్నాన్నకు ఒక ధనవంతుడైన స్నేహితుడుండే వాడు. అతని ఇల్లూ మీ ఇల్లులాగే ఉండేది. అతను నల్లగా, సన్నగా, పొడవుగా తెల్ల బట్టల్లో ఉండేవాడు. ఎప్పుడన్నా రోడ్డు మీద నేను కనిపిస్తే అందంగా, తెల్లటి పళ్ళు బయిట పెడుతూ పలకరించే వాడు. మా చిన్నాన్నలాంటి పేద మనిషితో స్నేహం చేయడానికి కల కారణం తెలియదు. అది మనిషిని మనిషిగా ప్రేమించగల వ్యక్తిత్వమేమో. అసలు విషయం – శీతాకాలం మంచు పడుతున్న వేళ రాజనీగంధాను చూస్తూ అతని ఇంటి ముందు నుంచీ వెళ్లడమంటే ఆ అయిదేళ్ల వయసులో బాగుండేది. అప్పటి అనంతాన్ని కాదు నేటి అనంతాన్ని. ఆ పూల వాసన వచ్చే ఏ ఇల్లైనా నాకు ఎప్పటికీ ఇష్టం."

"కొంటారా దీన్ని అమ్ముతానూ?"

"మరొకటి కొనుక్కుని చెట్టు వేసుకునే వీలు లేదా?" ఆమె భర్తతో అనింది.

తాను పూర్తిగా వెళ్లిపోకుండానే ఆమె నిష్క్రమించడం అనంతానికి అసంతృప్తిని కలిగించింది ఒక విందు భోజనం తర్వాతి చేదు రుచిలా. నేను పూర్తిగా మారలేదా? బలహీనతలు ఇంకా ఏవో, నాకు తెలియనివి దొంగల్లా దాక్కుని ఉన్నాయి అనుకున్నాడు ఇల్లు ఒదిలి నడుస్తూ. ఒక కలలా ఉంది అంతా అతనికి. దంపతులు అదృష్టవంతులు. చక్కని సంసారం. ప్రశాంతమైన నదిలాంటి జీవితం.

ప్రతిరోజూ కృపారావు ఆట స్థలికి వస్తున్నాడు. ఇద్దరి మధ్యా చనువు వృద్ధి చెందింది. అతను అనంతాన్ని ఇంటికి రమ్మని మళ్ళీ ఆహ్వానించలేదు. అనంతం కృపారావును తన గదికి రమ్మని ఆహ్వానించదలచుకో లేదు అతను ఏమని అనుకున్నాసరే. తన దారిద్రియాన్ని అతను చూడడం వలన దాని ప్రభావం ఇరువురి సంబంధం మీద పడుతుందేమోనని భయం. అనంతం ఆట నైపుణ్యం కృపారావుతో ఒక సంబంధాన్ని ఏర్పరిచింది. తన దారిద్ర్యం ఎరుక ఆ స్థాయిని ఒక మెట్టు క్రిందికి కృపారావు మనసుకు తెలియ కుండానే లాగేప్రమాదముంది.

భార్యాభర్తలిద్దరూ రెండు విధాలుగా అనంతం గది ముందునుండే వెళుతుంటారు: ఇద్దరూ కలిసి కార్లోనో, మోటార్ సైకిలు మీదనో. ఒక రోజున అనుకోని సంఘటన జరిగింది. అదేదో జీవితంలో అసాధ్యమైన, అసాధారణ సంఘటన అని మనసుకు అనిపించింది. అలా అనిపించడం అతన్ని ఆశ్చర్యపరిచింది. దాంట్లో ఏదో ప్రత్యేకతుంది. ఆమె అతని గది ముందునుంచీ నడుస్తోంది. అతను గది ముందుకొచ్చి రోడ్డును చూస్తున్నాడు. ఆమె అతన్ని చూసి తత్తరపడలేదు; అతను పడ్డాడు.

"కృపారావు గారేరీ?" అన్నాడు రోడ్డు మీదికొచ్చి.

"ఈరోజు ఆయన రెండు గంటల ముందే వెళ్లిపోయారు. నేను నా స్కూటర్ మీద ఆఫీసుకెళ్ళాను. ఇంటికొస్తుంటే టైరు పగిలింది. మెకా నిక్కు ఇచ్చి కాలుకు బుద్ధి చెబుతున్నా."

"లోపలి వస్తారా; ఒక క్షణం కూర్చుని, మంచినీళ్లు తాగి వెళ్లొచ్చు."

బదులు చెప్పకుండా అతన్ని గదిలోకి అనుసరించింది. గదిలో ఒక మూలకు చాప చాచి దానిమీద పరుపు పరిచి ఉంది. ఒక గోడకు చెక్క కుర్చీ ఉంది. కూర్చోమన్నాడు.

"కూర్చోబోయే ముందు ఒక చిన్న పని చెయ్యాలి; మీ స్నానాల గది వాడతాను."

ముందు తను వెళ్లి అంతా శుభ్రంగానే ఉందని తేల్చుకుని, “వెళ్ళండి," అన్నాడు.

"ఏమీ లేదు చేతులకు స్కూటరు మురికి, చమురు అంటుకున్నాయి, అవి శుభ్రం చేసుకోవాలి," అని స్నానాల గది తలుపు తీసి ఉంచే వాష్ బేసినులో సబ్బుతో చేతులు కడుక్కుని వచ్చింది. తువ్వాలు ఇవ్వబోయాడు. అక్కర్లేదని తన తోలు సంచీ నుంచీ రుమాలు లాగి, చేతులు తుడుచుకుని దానితోనే మొహానికి పట్టిన చెమటలు అద్దు కుంది.

"ఆ రోజు తరువాత ఇంటికి రాలేదు మీరు."

"ఆ, కుదరలేదు," తల వంచి అన్నాడు.

"మీరు నిలబడి మాట్లాడుతుంటే, నేను ఆ పనే చేయకతప్పదు. “నేను నేల మీద కూర్చుంటాను, మీరు మీ పడక మీద కూర్చోండి."

అని కుర్చీలోనుంచీ లేవబోయింది. ఒద్దని నివారించి పరుపు మీద కూర్చున్నాడు. గదిని పరికించి చూస్తోంది. నాలుగు గోడల మధ్య ఉన్న చతురస్ర ఆకార స్థలంలో నగ్న నృత్యం చేస్తోంది దారిద్రియం.

"ఏ వ్యాపకం పెట్టుకోలేదా?"

"ప్రయత్నలోపం లేదు. బ్రతుకుతెరువుకై తాపత్రయం పుష్కలంగా ఉంది.

గది మూల గట్టుమీదున్న కూజా దగ్గిరకు వెళ్లి గ్లాసును నీటితో నింపి ఆమెకిచ్చాడు.

"బాకీ తీర్చేసుకుంటున్నారా?"

"తీర్చే వీలులేని బాకీపాలు చేయొచ్చుగా నన్ను?"

"ఇచ్చే వాడు తీర్చగలడా లేదా అన్న విషయాన్ని నిర్ధారించుకుని కదా అప్పిస్తాడు. పైగా పత్రాలు వ్రాయించుకుంటాడు."

"బాకీలు కేవలం డబ్బుకు సంబంధించినవే కాదు కదా. వాటికి పత్రాలుండవు; మనిషి నమ్మకం మీద అవి జరుగుతాయి."

"మీ ఋణం తీర్చాలనిగాని, తీర్చకపోతే ఫరవాలేదు అనిగాని భావిస్తూ ఎలాంటి అప్పు గురించైనా ఆలోచించడానికి మన మధ్య ఉన్న పరిచయం చాలదు."

"అంతటి పరిచయం అవడానికి ప్రయత్నం చేస్తూ ఆగమంటారా?"

"అలాంటి పరిచయం ఒకే వ్యక్తి మీదే ఆధారపడున్నట్టు మీరు భావిస్తున్నట్టున్నారు. రెండవ వ్యక్తి భాగస్వామ్యం అవసరం లేదా?"

"నిజమే. అత్యాశకు పోగూడదు."

"పరిచయానికి, అత్యాశకూ అనవసరంగా ముడిపెడుతున్నారు."

"ధనవంతురాలు లేక ధనవంతుడి పరిచయానికి పెద్దగా తాపత్ర యపడటం అత్యాశ కాదా?"

"ధనవంతుడి డబ్బును ఆశించే పరిచయం ఏర్పరచుకోవడం అత్యాశ. కేవలం గొప్ప గురించీ పరిచయం ఏర్పరచుకోవాలి చూడటం ఆశ."

"పోనీ, మీతో పరిచయం కేవలం గొప్ప గురించీ కోరుకుంటున్నానని మీరు కనికరం చూపవచ్చు. మీరు ధనవంతులో కాదో నాకు తెలియదు."

“రుజువులు లేకపోయినా, మీరన్నది తప్పుకాకపోవచ్చని నా మనసు చెబుతోంది. మీకు గొప్ప అనిపించేది మాకు నష్టం, కష్టం కలిగించనపుడు స్నేహం అనిపించేంత పరిచయానికి అవకాశం నేను కలిగించ వచ్చు. అయినా ఇలా నేను అనడంలో నా ఆధిక్యత చాటుకున్నట్టుంటుంది. మిమ్మల్ని తక్కువచేసి మాట్లాడినట్టవుతుంది కూడా."

"నేను మీకన్నా సామాజిక, ఆర్థిక స్థాయిలలో చాలా తక్కువవాడినయినపుడు ఎవరన్నా నన్ను చిన్న చూపు చూసినా నేను పట్టించుకోను. మీరు నన్ను చిన్న చూపు చూసే మనిషయుంటే ఆ విషయమే ప్రస్తావించరనుకుంటా. ఈ కుచేలుడి గదికి రారు, ఇంత  చనువుగా మాట్లాడరు."

"మీలో ఏ ప్రత్యేకతా లేదా?" కొంటెదనం దాచుకునే విఫలయత్నం చేస్తూ అనింది.

"ఒకవేళ ఎప్పుడన్నా నాలో అదుందని నేను నాకు చెప్పుకున్నా ఇప్పుడు మాత్రం గుర్తుకు రావడంలేదు."

"తరువాత ఎప్పుడన్నా గుర్తుకు తెచ్చుకుని చెప్పండి."

"నేను గుర్తుకు తెచ్చుకునే ఇబ్బంది ఎందుకూ? మీకు తెలిస్తే చెప్పరాదూ?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS